క్లుప్తంగా

కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ నాయకులు



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో నాయకులు

చుంచుపల్లి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్, పలువురు అసెంబ్లీ కన్వీనర్లు శనివారం హైదరాబాద్‌లో కలిశారు. జిల్లాలో బీజేపీలో జరుగుతున్న పరిణామాలను వివరించారు. కిషన్‌రెడ్డిని కలిసిన వారిలో పినపాక అసెంబ్లీ కన్వీనర్ భిక్షపతి, ఇల్లెందు అసెంబ్లీ కన్వీనర్ గోపీకృష్ణ, భద్రాచలం అసెంబ్లీ కన్వీనర్ త్రినాథరావు, అశ్వారావుపేట అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వెంకటరెడ్డి నియామకంపై హర్షం



పాల్వంచ: హైకోర్టు ప్రభుత్వ న్యాయవాదిగా ఈదునూరి వెంకటరెడ్డి నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. వెంకటరెడ్డి చిన్నతనంలో పాల్వంచ సీ కాలనీలో నివాసం ఉండేవారు. ఆయన తండ్రి కేటీపీఎస్ ఇంజనీర్‌గా విధులు నిర్వహించారు. ప్రాథమిక విద్యాభ్యాసం శిశుమందిర్ పాఠశాలలో, హైస్కూల్ కేటీపీఎస్ పాఠశాల, ఇంటర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకున్నారు. విశాఖపట్నంలో నందమూరి బసవతారకం కళాశాలలో లా పూర్తి చేశారు. అనంతరం హైకోర్టు లాయర్‌గా ప్రాక్టీస్ ప్రారంభించారు. ప్రభుత్వం ఇటీవల వెంకటరెడ్డిని హైకోర్టు న్యాయవాదిగా నియమించడం పట్ల పరుచూరి వెంకటేశ్వరరావు, రావి నాగార్జున హర్షం వ్యక్తం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సేవా సమితి కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను వృత్తి శిక్షణ కోర్సులలో శిక్షణ ఇచ్చే శిక్షకులు, వివిధ రకాల శిక్షణ పొందే వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) సామ్యేల్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టైలరింగ్, బ్యూటీషియన్ , మగ్గం, ప్రీ ప్రైమరీ టీచర్ కోచింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ 3 నెలల కాల పరిమితి కొరకు శిక్షణ ఇచ్చేందుకు అర్హత కలిగిన శిక్షకుల నుంచి కూడా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటు సర్టిఫికెట్స్, ఆధార్ కార్డ్, జిరాక్స్, పాస్‌పొటో జత చేసి, సింగరేణి హెడ్డాఫీస్‌లోని కమ్యూనికేషన్ విభాగంలో ఈనెల 20వ తేదీలోపు అందజేయాలని సూచించారు.

గోర్ బంజారా పోరాట సమితి మండల అధ్యక్షుడిగా సుమన్



నియామకపత్రం అందుకుంటున్న సుమన్

జూలూరుపాడు: భారతీయ గోర్ బంజారా పోరాట సమితి మండల అధ్యక్షుడిగా గుగులోత్ సుమన్ నియమితులయ్యారు. శనివారం జూలూరుపాడులో గోర్ బంజారా పోరాట సమితి ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్ చేతుల మీదుగా సుమన్ నియామకపత్రాన్ని అందుకున్నారు. సుమన్ మాట్లాడుతూ.. గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో నాగరాజు చౌహాన్, బానోత్ రాంబాబు, భాస్‌సింగ్ పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుడికి సన్మానం

జూలూరుపాడు: విద్యుదాఘాతానికి గురైన ఆరేళ్ల బాలుడ్ని ప్రాణాపాయస్థితి నుంచి కాపాడిన గ్రామీణ వైద్యుడు ఉసికల నరసింహారావును బాలుడి తల్లిదండ్రులు శనివారం సన్మానించారు. ఈనెల 9న గుండెపుడి గ్రామానికి చెందిన భూక్యా వెంకటేష్–సరోజని దంపతుల కుమారుడు సాత్విక్ విద్యుదాఘాతానికి గురయ్యాడు. తల్లిదండ్రులు జూలూరుపాడు ఆర్ఎంపీ నరసింహారావు వద్దకు తీసుకొచ్చారు. ఆయన బాలుడికి సీపీఆర్ చేసి ప్రాణాపాయ స్థితి నుంచి రక్షించాడు. అనంతరం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. బాలుడు కోలుకోవడంతో తల్లిదండ్రులు ఆర్ఎంపీని కృతజ్ఞతాభావంతో సన్మానించారు.

స్వీట్ కార్న్



- రుచికి రుచి.. ఆరోగ్యానికి ఆరోగ్యం
- మొక్కజొన్న కంకులకు డిమాండ్
- రోడ్ల వెంట జోరుగా వ్యాపారం




కంకులు విక్రయిస్తున్న మహిళ (ఇన్‌సెట్) ఉడకబెట్టిన మొక్కజొన్న కంకులు

సండే స్పెషల్

సుజాతనగర్: మొక్కజొన్న కంకులను ఉడకబెట్టినా.. నిప్పులపై కాల్చి తిన్నా ఆ రుచే వేరు. ముసురు వాతావరణానికి మరింత రుచి. మొక్కజొన్న కంకుల్లో పోషకాలు మెండుగా ఉంటాయి. కంకులు రుచికి రుచి.. ఆరోగ్యానికి ఆరోగ్యం. దీంతో ఎక్కువ శాతం మంది ప్రజలు వీటిని తినేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. రైతులు కూడా ఈ పంటను సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. కూరగాయల సాగు చేసే రైతులు అదనపు ఆదాయం కోసం స్వీట్ కార్న్ సాగు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పాల్వంచ, సుజాతనగర్, జూలూరుపాడు, టేకులపల్లి, ఇల్లెందు, అన్నపురెడ్డిపల్లి తదితర మండలాల్లో స్వీట్ కార్న్ పంటను ఎక్కువగా సాగుచేశారు. వీటితోపాటు నాటు కంకులను కూడా సాగుచేస్తుంటారు. ఆయా మండలాల పరిధిలో ప్రధాన రహదారుల పక్కన ఎక్కడ చూసినా మొక్కజొన్న కంకులను అమ్మే చిరువ్యాపారులే కనబడుతుంటారు. స్వీట్ కార్న్ కంకులకు డిమాండ్ ఎక్కువగా ఉండడంతో నాయకులగూడెం, వేపలగడ్డ గ్రామాల వద్ద కొందరు విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసి ఉపాధి పొందుతున్నారు. వచ్చిపోయే వాహనదారులు వాహనాలను ఆపి మరీ స్వీట్ కార్న్ కొని ఇంటికి తీసుకెళ్తున్నారు. బయట ప్రాంతాలకు చెందిన వారితో పాటు, చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వారు కూడా ఈ రోడ్డు మీదకొచ్చి కంకులను కొనుగోలు చేస్తున్నారు. విక్రయ కేంద్రాల్లో ఉడకబెట్టిన, కాల్చిన కంకి ఒకటి రూ.25, పచ్చి కంకులు కేజీ రూ.60 చొప్పున అమ్ముతున్నారు. కంకులు మరింత రుచికరంగా ఉండేందుకు ఉప్పు, కారం, నిమ్మరసం వేసి ఇస్తుండడంతో ప్రస్తుతం ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.

ఇష్టంగా తింటాం..



ఎప్పుడైనా కాల్చిన, ఉడకబెట్టిన కంకులు అంటే చాలా ఇష్టం. రోడ్డుపై ఎక్కడ కనిపించినా తప్పకుండా కొని ఇంటికి తీసుకెళ్తాను. ఇంట్లో అందరం కలిసి ఎంతో ఇష్టంగా తింటాం.

– ఉడుగుల నాగరాజు, వేపలగడ్డ

చాలా రుచిగా ఉంటాయి..



మొక్కజొన్న కంకులంటే చాలా ఇష్టం. ఉడకబెట్టిన కంకులు రుచిగా ఉంటాయి. ఇటువైపు వచ్చిన ప్రతీసారీ కంకి కొంటాను. ఉప్పు, కారం, నిమ్మరసం వేసి ఇస్తారు. మరింత రుచిగా ఉంటాయి.

– నల్లగోపు పుల్లయ్య, సుజాతనగర్

షాపుల అద్దె హైస్కూల్‌కు ఇవ్వాలి



మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఇల్లెందు: పట్టణంలోని మెయిన్‌రోడ్ హైస్కూల్‌కు దాని ఎదురుగా ఉన్న కాంప్లెక్స్ ఆదాయంలో 40 శాతం వాటా అందజేస్తామని మున్సిపల్ పాలకులతో ఉన్న అంగీకారం ప్రకారం నిధులు అందజేయాలని అఖిలపక్ష విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం ఇల్లెందులో అఖిలపక్ష విద్యార్థి సంఘాల సమావేశం జరిగింది. సంఘాల నేతలు కాంపాటి పృథ్వీ, వి.హరీష్‌గౌడ్, భయ్యా అభిమన్యు, గణేష్ మాట్లాడుతూ... స్కూల్ కాంప్లెక్స్ స్థలంలో మున్సిపాలిటీ 40 గదుల నిర్మాణం చేసిందన్నారు. ఆ గదుల కిరాయిల నుంచి 40 శాతం వాటా ఇస్తామని ఒప్పందం ఉందని చెప్పారు. ఈ సమావేశంలో బి.సాయికుమార్, అబ్దుల్ ఘనీ, సాయి, పవన్ కుమార్, కిషన్ పాల్గొన్నారు.

ఆగస్టు 9న సేవాలాల్ సేన రాష్ట్ర మహాసభ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

టేకులపల్లి: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 9న బాబూ జగ్జీవన్‌రామ్ భవన్, సరూర్‌నగర్ హైదరాబాద్‌లో నిర్వహించే సేవాలాల్ సేన రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సేవాలాల్ సేన రాష్ట్ర నాయకులు భూక్యా రవి రాథోడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ సురేష్ నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహాసభ కరపత్రాలను విడుదల చేశారు.

మాట్లాడుతూ.. బంజారా జాతి కోల్పోతున్న సంప్రదాయ సంస్కృతిని పరిరక్షిస్తూ గిరిజనులకు రాజ్యాంగంలో కల్పించిన హక్కులు మరియు జాతి మనుగడతో పాటు రాజ్యాధికార సాధనే లక్ష్యంగా సేవాలాల్ సేన పనిచేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో జీఓ 3ను పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బానోతు నాగరాజు, గణేష్, హరికిషన్, ధర్మసింగ్, వాసు, పరశురాం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌పై ప్రభుత్వం స్పందించాలి

టేకులపల్లి: తెలంగాణ విద్యార్థులకు చెల్లించాల్సిన స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని పీడీఎస్‌యూ ఇల్లెందు డివిజన్ కార్యదర్శి బానోత్ నరేందర్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కేసీఆర్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్ చెల్లించకుండా కాలయాపన చేసిందని, ఫలితంగా విద్యార్థులు ఫీజులు చెల్లించలేక నేటికీ తమ సర్టిఫికెట్స్ ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాల వద్దనే ఉన్నాయని తెలిపారు. అదే తరహాలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తోందని ఇప్పటి వరకు సుమారు రూ.7 వేల కోట్లు చెల్లించాల్సి ఉందని వీటిపై ప్రభుత్వం స్పందించకపోవడంతో విద్యార్థులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని పేర్కొన్నారు.

ఫీజులు చెల్లించలేని విద్యార్థులు పైచదువులకు వెళ్లలేకపోతున్నారని, విద్యాసంస్థలు నడిపించలేక కొన్ని విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యాసంస్థలను మూసివేశారని, మరికొన్ని విద్యాసంస్థల యాజమాన్యాలు కొత్త గురుకులాలకు అద్దె భవనాలుగా ప్రభుత్వానికి అప్పజెప్పిన దుస్థితి ఏర్పడిందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు.

సహకార సంఘాలకు ‘ముల్కనూరు’ ఆదర్శం



ముల్కనూరు సొసైటీ పరిధిలోని మిల్లులను పరిశీలిస్తున్న పాల్వంచ పాలకవర్గ సభ్యులు

పాల్వంచ: తెలంగాణ రాష్ట్రంలోని వ్యవసాయ సహకార సంఘాలకు ముల్కనూరు సహకార సంఘం ఆదర్శంగా నిలుస్తుందని డీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు రోజుల క్రితం పాల్వంచ సహకార సంఘం పాలకవర్గ సభ్యులు హన్మకొండ జిల్లా ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి, మార్కెటింగ్ సొసైటీని సందర్శించారన్నారు. అక్కడ రైతులకు పంట రుణాలతో పాటు అన్ని రకాల రైతు రుణాలు ఇస్తున్నారని, 14 గ్రామాల్లో గోడౌన్లు నిర్మించి వాటి ద్వారా ధాన్యం, పత్తి వంటి పంటలను నేరుగా కొనుగోలు చేస్తున్నారని, వారి సొంత మిల్లుల్లోనే ధాన్యాన్ని బియ్యం పట్టి వారే అమ్ముతున్నట్లు చెప్పారు. సంఘం ద్వారానే ధాన్యం కొనుగోలు, విత్తనాల శుద్ధి, జిన్నింగ్, రైస్ మిల్లులు, పెట్రోల్ బంక్, గ్యాస్ డీలర్ షిప్, సూపర్ బజార్ వంటి వ్యాపారాలు చేస్తున్నారని పేర్కొన్నారు. మహిళా సంఘాలతో రోజుకు 70వేల లీటర్ల సామర్థ్యం కలిగిన పాల ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసి దాని ద్వారా పెరుగు, నెయ్యి, బాదంపాలు, పలు రకాల ఉత్పత్తులు చేసి లాభాలనార్జించి దేశానికే తలమానికంగా నిలిచిందన్నారు. పర్యటనలో కోఆపరేటివ్ ట్రైనర్ పి.రాజయ్య, సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేశ్, డైరెక్టర్లు కనగాల నారాయణ, చౌగాని పాపారావు, సామా జనార్దన్‌రెడ్డి, మైనేని వెంకటేశ్వరరావు, భూక్యా కిషన్, యర్రంశెట్టి మధుసూదన్‌రావు, నిమ్మల సువర్ణ, బర్ల వెంకటరమణ, సీతాడ లక్ష్మీనారాయణలు పాల్గొన్నారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

ఇల్లెందురూరల్: ఇల్లెందు సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 12 వరకు విద్యుత్ సరఫరాలో ఉండదని ట్రాన్స్‌కో ఏఈ రాము శనివారం తెలిపారు. మండలంలోని సుభాష్‌నగర్, సుదిమళ్ల, పూబెల్లి, బొజ్జాయిగూడెం, రాఘబోయినగూడెం, మిట్టపల్లి, మొండితోగు, రొంపేడు, పూసపల్లి, పట్టణంలోని ఆర్అండ్ఆర్ కాలనీ, కళాంజలి థియేటర్, బుగ్గవాగు బ్రిడ్జి ప్రాంతాలలో నాలుగు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇల్లెందురూరల్: మాణిక్యారం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిర్వహిస్తున్నట్లు ఆదివారం ఉదయం 9గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో రూరల్ ఏఈ రవి శనివారం తెలిపారు. మాణిక్యారం, సర్వేతండా, వీరాపురం, ఒంపుగూడెం ఫీడర్ల పరిధిలో విద్యుత్తు సరఫరా ఉండదని తెలిపారు.

నేడు ‘గూడెం’లో ఎంపీ పర్యటన

కొత్తగూడెంరూరల్/పాల్వంచరూరల్: ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ఆదివారం జిల్లా కేంద్రం కొత్తగూడెంలో పర్యటించనున్నారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటలకు స్థానిక రైల్వే స్టేషన్‌ను సందర్శించి, అక్కడ ప్రయాణికుల మౌలిక వసతులను పరిశీస్తారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి కొత్తగూడెంలోని మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. సాయంత్రం 4 గంటలకు పెద్దమ్మ తల్లి దేవస్థానానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేయనున్నారు. 4:30 గంటలకు కేటీపీఎస్ అతిథి గృహానికి చేరుకుంటారు.

టెండర్ల ఆహ్వానం

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే ఓసీలో 2 బొలెరో వాహనాలు, ఏరియా ఆస్పత్రిలో అంబులెన్స్ నిర్వహణకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఏరియా జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. శనివారం ఆయన వెల్లడించిన వివరాలు... ఆగస్టు 4వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ఆసక్తి గలవారు రూ.590 ఫీజుతో జీఎం కార్యాలయంలో ఫైనాన్స్ విభాగంలో దరఖాస్తులు పొందవచ్చని, వివరాలకు జీఎం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

నేడు రాధక్క సంతాప సభ

టేకులపల్లి: సీపీఐ(ఎంఎల్) సీనియర్ నాయకుడు, గోదావరి లోయ ప్రతిఘటన ఉద్యమ నిర్మాత చంద్ర పుల్లారెడ్డి (సీపీ) జీవిత సహచరి కామ్రేడ్ రాధక్క సంతాప సభ జూలై 14న వరంగల్‌లో నిర్వహించనున్నారని, జయప్రదం చేయాలని పార్టీ కొత్తగూడెం జిల్లా నాయకుడు భూక్యా హర్జ్యా పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం మండలంలోని బద్దుతండాలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ నోముల భానుచందర్, భూక్యా నర్సింగ్, ధరావత్ ఈర్యా, శంకర్, బోడ లింబా, భీముడు, హర్యా, లక్ష్మణ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: ఈ నెల 14న వరంగల్‌లో నిర్వహిస్తున్న రాధక్క సంతాప సభను జయప్రదం చేయాలని పీవైఎల్ మండల కార్యదర్శి రావూరి ఉపేందర్ పిలుపునిచ్చారు.

ఈ మేరకు బొజ్జాయిగూడెం గ్రామంలో రాధక్క సంతాప సభ ప్రచార వాల్‌పోస్టర్లను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో కొండపల్లి శ్రీనివాస్, గొల్ల వెంకన్న, సత్యనారాయణ, బొర్ర రమేష్, శ్రీదేవి, లింగమ్మ, సుజాత పాల్గొన్నారు.

విస్మరిస్తే ఉద్యమం ఉధృతం..



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

ఇల్లెందు: సీతారామ ప్రాజెక్టు రీడిజైన్ ద్వారా ఇల్లెందుకు సాగు నీరు ఇవ్వాల్సిందేనని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఎల్లన్న భవన్‌లో అఖిల పక్ష రైతు సంఘాల నేతలు సమావేశమై నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ఏఐకేఎస్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఏపూరి బ్రహ్మం, సీపీఎం జిల్లా నాయకులు నబీ, టీఆర్ఎస్ జిల్లా నాయకులు సిలివేరు సత్యనారాయణ, టీడీపీ నాయకులు ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ... గోదావరి నదీ జలాలపై నిర్మించే దుమ్ముగూడెం ప్రాజెక్టును స్వర్గీయ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం 2005లో ఇందిరాసాగర్ పేరుతో శంకుస్థాపన చేస్తే మాజీ సీఎం కేసీఆర్ దానిని సీతారామ ప్రాజెక్టుగా నామకరణ చేసి రోళ్లపాడులో శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రతీ ఎకరాకు సాగు నీరు అందించాలనే సంకల్పంతో ప్రారంభిస్తే రీడిజైన్ పేరుతో ప్రాజెక్టును కొల్లగొట్టారని తెలిపారు. ఇప్పుడు మొదటి దశలో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో 26 మండలాలకు సాగు నీరు అందిస్తామని టెండర్లు పిలిచారని తెలిపారు. 6.74 లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తామని ప్రకటించినప్పటికీ 4.60 లక్షల ఎకరాలు పాత ఆయకట్టు ఖమ్మం జిల్లా పరిధిలోనే ఉందన్నారు. ప్రాజెక్టు మొత్తం కొత్తగూడెం జిల్లా నుంచి వెళ్తుంటే భూములు నష్టపోతోంది ఇక్కడి రైతులు... పంటలు పండించుకునేది అక్కడి రైతులా..? అని ప్రశ్నించారు. గోదావరి జలాలను కృష్ణా ఆయకట్టు కోసం తరలిస్తున్నారని, ఇల్లెందు నియోజకవర్గానికి అందించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 21న అన్ని మండలాల్లో సదస్సులు నిర్వహిస్తామన్నారు. ముచ్చటగా మూడుసార్లు సీతారామ ప్రాజెక్టును రీడిజైన్ చేశారని, అయినా ఈ ప్రాజెక్టులో కీలకంగా ఉండే రోళ్లపాడు ప్రాజెక్ట్ రీడిజైన్‌లో ఎగిరిపోయిందన్నారు. ప్రభుత్వ వైఖరిని ఎండగట్టేందుకు అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



మంత్రి పొంగులేటిని సన్మానిస్తున్న నాయకులు

పాల్వంచ: ఎంతోకాలంగా పరిష్కారానికి నోచుకోని విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కోడూరి ప్రకాష్, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీ జాన్సన్, చారుగుండ్ల రమేష్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డిలను కలిసి సన్మానించారు. అనంతరం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈపీఎఫ్‌ను జీపీఎఫ్‌గా మార్చాలని, సీనియర్ ఫోర్‌మెన్, ఆర్టిజన్లు ఐదు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసినవారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. మిగిలిపోయిన కాంట్రాక్ట్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ విషయాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ కరంట్‌రావు, సందుపట్ల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రహదారిని అభివృద్ధి చేయండి..



రోడ్డును పరిశీలిస్తున్న కొత్వాల

పాల్వంచరూరల్: డ్రెయినేజీ అస్తవ్యస్తంగా నిర్మాణం చేయడం వలన జగన్నాథపురం నుంచి సోములగూడెం వెళ్లే రహదారిలో వర్షం కురిస్తే రోడ్డుపై వరద చేరి రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని వెంటనే మరమ్మతులు నిర్వహించాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. జగన్నాథపురంలో శనివారం ఆయన పర్యటించారు. బీసీఎం జాతీయ ప్రధాన రహదారి నుంచి హైస్కూల్ వైపు వెళ్లే రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉందని కొత్వాల ఆశ్రయించారు. స్పందించిన ఆయన వెంటనే ఎంపీఓ నారాయణకు ఫోన్ చేసి రహదారి సమస్యను వివరించారు. వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో యర్రంశెట్టి ముత్తయ్య,కొండం వెంకన్న, వై.వెంకటేశ్వర్లు, కొండం పుల్లయ్య, గంధం నర్సింహారావు, తాళ్లూరి శణ్ముఖచారి, కామాచారి, పెండ్లిరామిరెడ్డి, సీత, శాంతివర్ధన్, భరత్,సురేష్ తదితరులు ఉన్నారు.

సెక్యూరిటీ సిబ్బంది వృత్తి నైపుణ్యం సాధించాలి



బహుమతులు అందజేస్తున్న జాకీర్ హుస్సేన్

సింగరేణి(కొత్తగూడెం): సెక్యూరిటీ సిబ్బంది మెరుగైన వృత్తి నైపుణ్యంతో విధులు నిర్వహించి సంస్థ ఆస్తులకు కాపాడాలని, కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ ఎండీ జాకీర్ హుస్సేన్ అన్నారు. కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలోని సింగరేణి సెక్యూరిటీ ట్రైనింగ్ సెంటర్‌లో 77వ బ్యాచ్ సెక్యూరిటీ (ఎస్అండ్‌పీసీ) గార్డులకు 15 రోజుల పాటు నిర్వహించిన పునఃశ్చరణ శిక్షణ తరగతుల ముగింపు శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. సిబ్బంది అంకితభావంతో పని చేయడానికి కంపెనీ 2006 నుంచి కొత్తగూడెం ప్రధాన కేంద్రంగా ఎస్అండ్‌పీసీ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ నిర్వహించటం జరుగుతుందని, ప్రతీ బ్యాచ్‌కు రెండువారాల శిక్షణ కాలంలో ఫిజికల్ ట్రైనింగ్, డ్రిల్, సెక్యూరిటీ ఆపరేషన్స్, ఫస్ట్ ఎయిడ్ ఫైర్ ఫైటింగ్, కంపెనీ చట్టాలు, న్యాయ అంశాలపై శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. అనంతరం ఉత్తమ ట్రైనీలుగా ఎంపికయిన సయ్యద్ అజీజ్, బి.సమ్మయ్య, బి.జయరాజ్‌లకు బహుమతులు అందజేశారు. అనంతరం శ్రీజ్యోతి అనాథ శరణాలయ నిర్వాహకులకు, ట్రైనింగ్ సిబ్బంది ద్వారా సేకరించిన నిత్యావసరాలను అందజేశారు.

అంతర్గత రోడ్లు అస్తవ్యస్తం


- పారిశుద్ధ్యం అధ్వానం
- ఇబ్బంది పడుతున్న సురారం గ్రామస్తులు



సురారంలోని ఓ వీధిలో అధ్వానంగా రోడ్డు

జూలూరుపాడు: సురారం గ్రామంలో అంతర్గత రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. నెల రోజులగా కురుస్తున్న వానలకు గ్రామంలోని అంతర్గత రోడ్లన్నీ బురదమయంగా తయారయ్యాయి. సీసీ రోడ్లపై వరదనీరు నిలిచి బురద పేరుకపోవడంతో చిత్తడి మారడంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. సీసీ రోడ్లు మట్టి రోడ్లను తలపిస్తున్నాయి. ఇళ్లలో నుంచి కాలు బయటపెట్టే పరిస్థితి లేదని స్థానికులు వాపోతున్నారు. సీసీ రోడ్లపై పేరుకపోయిన బురద వలన దోమలు, క్రిమికీటకాలు చేరుతున్నాయంటున్నారు. పశువులు, వాహనాల రాకపోకలతో మరింత అధ్వానంగా తయారయ్యాయని ప్రజలు చెబుతున్నారు. వీధుల్లో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్లల్లో నుంచి వచ్చే మురుగు, వర్షపు నీరు రోడ్లపై నిలుస్తున్నాయి. గ్రామంలో పారిశుద్ధ్య పనులు అధికారులు చేపట్టడం లేదని, కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదని, దోమలు విజృంభించి రాత్రీ పగలు అనే తేడా లేకుండా దోమలు కుడుతుండటంతో అనారోగ్యం బారినపడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. చిరుజల్లుతో కూడిన వాన పడుతుండటంతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీ రోడ్లపై పేరుకపోయిన బురద తొలగించి, మట్టి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, అదేవిధంగా గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.


రోడ్లు చిత్తడిగా మారాయి...



రోడ్లన్నీ బురదగా మారడంతో అడుగు తీసి బయట పెట్టలేక పోతున్నాం. సీసీ రోడ్లపై బురద చేరడంతో చిత్తడిగా మారుతున్నాయి. వానలకు మరింత ఇబ్బందిగా మారాయి. రోడ్లపై ఉన్న బురదమట్టిని తొలగించడంతోపాటు, మట్టి రోడ్లకు మరమ్మత్తులు చేపట్టాలి.

– కొర్రా మోతీలాల్, సురారం

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. దోమలు విజృంభించడంతో రాత్రి, పగలు అనే తేడా లేకుండా కుడుతుండటంతో అనారోగ్యం పాలవుతున్నాం. మురుగు గుంతలు, వీధుల్లో బ్లీచింగ్ చల్లించాలి. దోమల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బానోత్ మోయిలాల్, సురారం